క్లుప్తంగా

రేపు జాబ్‌మేళా

ములుగు: నిరుద్యోగ యువతీ, యువకులకు సుస్థిర ఇన్ఫ్రా ప్రాజెక్స్ లిమిటెడ్ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కుమారస్వామి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియేట్ ఆ పై చదువులు చదివిన అభ్యర్థులు అర్హులని అన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఉదయం 11గంటలకు బయోడేటాతో హాజరుకావాలని సూచించారు. సెలెక్ట్ అయిన వారు హైదరాబాద్‌లోని మియాపూర్‌లో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని, ఇతర వివరాలకు 8297338888 నంబర్‌ను సంప్రదించాలని అన్నారు.

ఎస్సైని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు



ఏటూరునాగారం : నూతనంగా ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన గుర్రం కృష్ణప్రసాద్‌ను బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వీట్ పంపిణీ చేశారు. కలిసిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్, తుమ్మ మల్లారెడ్డి, మైనార్టీ సెల్ ఖాజాపాషా, వైస్ ఎంపీపీ తుమ్మ సంజీవరెడ్డి, మేడారం ట్రస్టు బోర్డు డైరెక్టర్ సప్పిడి రాంనర్సయ్య, ఎంపీటీసీ కుమ్మరి స్వప్న చంద్రబాబు, తదితరులు ఉన్నారు.

జిల్లా అధ్యక్షుడికి సన్మానం



ములుగు రూరల్(గోవిందరావుపేట): కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన గోవిందరావుపేట మండలం చల్వాయికు చెందిన పైడాకుల అశోక్‌ను నియమించగా మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. బుధవారం హన్మకొండలోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు.సన్మానించిన వారిలో పాలడుగు వెంకటక్రిష్ణ, కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, గుండబోయిన అనిల్, ఏడుకొండలు, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

బొడ్రాయికి పూజలు



వాజేడు : మండలంలోని జగన్నాథపురంలో బుధవారం బొడ్రాయి వేడుకలను నిర్వహించారు. గ్రామస్తులు అంతా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. గత సంవత్సరం గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం చేశారు. అందులో భాగంగా గ్రామంలో పలు దేవతలను నిలిపారు. ఏడాది పూర్తయిన సందర్భంగా ఆ దేవతలకు ప్రత్యేకంగా పూజలను వేడుక రూపంలో నిర్వహించారు.

వాహనాల తనిఖీ



ఏటూరునాగారం : మండల కేంద్రంలోని వై జంక్షన్ వద్ద బుధవారం సాయంత్రం సెకండ్ ఎస్సై పోరిక లాల్ తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. 163 జాతీయ రహదారిపై ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లే వాహనాలను ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపిస్తున్నారు. వాహనాల్లో ప్రయాణించే వారి వివరాలను సేకరించారు. అంతేకాకుండా వాహన డ్రైవర్లకు ప్రభుత్వ ఆమోదిత పత్రాలు ఉన్నాయా లేదా పరిశీలించారు. వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణం చేసినా, ట్రిబుల్ డ్రైవ్ చేసినా, లైసెన్సులు లేకుండా వాహనం నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహదేవపూర్ : మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై స్థానికులు పోలీస్‌లు వాహనాల తనిఖీలు చేపట్టారు. వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంతో పాటు మావోయిస్టులకు డబ్బులు సరఫరా చేస్తూ పట్టుబడిన వ్యక్తుల సమాచారంతో పోలీస్‌లు అప్రమత్తయ్యారు. ఈ నేపథ్యంలో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ లు చేస్తున్నట్లు ఎస్సై భవానిసేన్ తెలిపారు.

విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించాలి

- ములుగు ఎంపీపీ గండ్రకోట శ్రీదేవి
- ముగిసిన సీఎం కప్ క్రీడలు



ములుగు రూరల్ : విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ శ్రీదేవి, అధికారులు

ములుగు రూరల్: విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించాలని ఎంపీపీ గండ్రకోట శ్రీదేవిసుధీర్‌యాదవ్ అన్నారు. సీఎం కప్‌లో భాగంగా మండలంలోని జాకారం సాంఘీక సంక్షేమ గురుకులంలో నిర్వహించిన క్రీడల్లో మొదటి, రెండవ స్థానాల్లో నిలిచిన వారికి ఎంపీపీ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, తహసీల్దార్ మధురకవి సత్యనారాయణ, ఎంపీడీఓ ఇక్బాల్‌తో కలిసి సర్టిఫికెట్లను అందించారు. కబడ్డీలో మొదటి స్థానంలో కన్నాయిగూడెం, రెండో స్థానంలో దేవగిరిపట్నం, వాలీబాల్‌లో మొదటిస్థానంలో అంకన్నగూడెం, రెండవ స్థానంలో కన్నాయిగూడెం, మహిళల వాలీబాల్‌లో మల్లంపల్లి-1 మొదటి స్థానంలో, మల్లంపల్లి-2 రెండవ స్థానంలో, ఖోఖోలో మొదటి స్థానంలో దేవగిరిపట్నం, రెండవ స్థానంలో మహ్మద్‌గౌస్‌పల్లి జట్లు నిలిచాయి. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి రమేశ్, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

ఏటూరునాగారం: ఓటమి గెలుపుకు నాంది అని ఎంపీపీ అంతటి విజయ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో సీఎం కప్ 2023 ఫైనల్స్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఖోఖో వాలీబాల్, కబడ్డీ, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్‌ను మూడు రోజుల పాటు అట్టహాసంగా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇక్కడ గెలుపొందిన వారి ప్రతిభను గుర్తించి జిల్లా క్రీడలకు పంపించనున్నట్లు వారు తెలిపారు. జెడ్పీ సీఈఓ ప్రసూనరాణి మాట్లాడుతూ గ్రామీణ క్రీడలతో యువకుల్లో నూతన ఉత్సాహం వచ్చిందన్నారు. క్రీడలతోపాటు చదువుల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఈసం రామ్మూర్తి, దొడ్డ కృష్ణ, ఎంపీటీసీలు, ఎంపీడీఓ కుమార్, పంచాయతీ కార్యదర్శి అశోక్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులకు బటర్‌మిల్క్ పంపిణీ

సీఎం కప్ కోసం ఆడేందుకు వచ్చిన క్రీడాకారులకు ఏటూరునాగారం బ్లడ్ డోనర్స్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లను జెడ్పీ సీఈఓ ప్రసూనరాణి, ఎంపీడీఓ కుమార్, సర్పంచ్‌లు రామ్మూర్తి, కృష్ణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో బ్లడ్ డోనర్స్ సయ్యద్ వహీద్, మెరుగు హరీష్, ఖాజాపాషా, ఎర్రమనేని సతీష్, బండపల్లి సంతోష్, వద్ది నరేష్, విజయ భాస్కర్, పాల్గొన్నారు.

వాజేడు: మూడు రోజులుగా నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బుధవారం సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం నుంచి పోటీలను నిర్వహించారు. ఇందులో పలు గ్రామ పంచాయతీల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఫైనల్‌కు చేరుకున్న క్రీడాకారులకు బుధవారం పోటీలను నిర్వహించి విజేతలకు షీల్డులతో పాటు సర్టిఫికెట్లను అందజేశారు.

వెంకటాపురం(కె): స్థానిక కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ క్రీడామైదానంలో ఈ నెల 15న ప్రారంభమైన సీఎం కప్ క్రీడలు బుధవారం ముగిశాయి. గెలుపొందిన క్రీడా కారులకు సర్పంచ్ పూజారి ఆదిలక్ష్మి, చిడెం యామిలి బహుమతులను అందజేశారు.కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అరవింద కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ అడ్డూరి బాబు, ఆలుబాక పాఠశాల హెచ్‌ఎం బొల్లే శ్రీనివాస్, బీసీ మర్రిగూడెం, మరికాల సర్పంచ్‌లు అట్టం సత్యవతి, తదితరులు ఉన్నారు.



ఏటూరునాగారం : క్రీడాకారులకు మజ్జిగ ప్యాకెట్లను అందజేస్తున్న జెడ్పీ సీఈఓ ప్రసూనరాణి



వాజేడు: సర్టిఫికెట్లు అందుకున్న క్రీడాకారులతో అధికారులు



వెంకటాపురం(కె) : బహుమతులు అందజేస్తున్న సర్పంచ్‌లు

పారిశుద్ధ్య రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి



వాజేడు: జగన్నాథపురంలో ముళ్ల పొదలు తొలగిస్తున్న జీపీ సిబ్బంది



మంగపేట : పారిశుద్ధ్యం పనులను ప్రారంభిస్తున్న మండల ప్రత్యేక అధికారి రవి



ఏటూరునాగారం : ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్, గ్రామపంచాయతీ సిబ్బంది

మంగపేట : మండలంలోని అన్ని గ్రామాలను పారిశుద్ధ్య రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని మండల స్పెషలాఫీసర్ తుల రవి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వారం పాటు నిర్వహించే ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని మండల కేంద్రంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీపీ ప్రత్యేక అధికారులు అందరు ప్రతి రోజు రెండు నుంచి మూడుసార్లు సందర్శించి పనులను పర్యవేక్షించాలన్నారు. ఆయా పంచాయతీలలోని యువజన సంఘాలు, స్టాండింగ్ కమిటీ సభ్యులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ప్రజలను భాగస్వామ్యం చేసి ప్రతి గ్రామంలో పారిశుద్ధ్య కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం మంగపేట, బోరునర్సాపురం, కమలాపురం తదితర గ్రామాల్లో జరుగుతున్న పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, సూపరింటెండెంట్ ఆలేటి సుదర్శన్ పంచాయతి కార్యదర్శి హీరు, మురళి తదితరులు పాల్గొన్నారు.

వాజేడు: శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా మండల వ్యాప్తంగా బుధవారం పొదలు తొలగించే కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో కార్యక్రమాన్ని ప్రారంభించారు. శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమం అధికారికంగా ఈ నెల 17 నుంచి 23 వరకు నిర్వహించాల్సి ఉంది. అందులో భాగంగానే పొదలు తొలగించారు.

ఏటూరునాగారం: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామంలో అన్ని రోడ్లను శుభ్రం చేసి పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని స్థానిక సర్పంచ్ ఈసం రామ్మూర్తి అన్నారు. బుధవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య అవగాహన ర్యాలీని చేపట్టారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ఈనెల 17 నుంచి 23 వరకు గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టడం జరుగుతుందన్నారు. వారం రోజుల పాటు జరిగేఈ కార్యక్రమాలకు ప్రజలు, యువకులు, మహిళలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, వార్డు సభ్యుడు నాగసాగర్, సాంబశివరావు, పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే సీతక్క

ములుగు : ఏటూర్‌నాగారంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర రోడ్లు, భవనాలు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, గిరిజన, శిశు, స్త్రీ సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్‌లకు ఎమ్మెల్యే ధనసరి సీతక్క బుధవారం వినతిపత్రం అందించారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించి సహకరించాలని కోరారు. మండలంలోని జంగాలపల్లి నుంచి సర్వాపూర్ వరకు రోడ్డు వైండింగ్ పనులు, జంగాలపల్లిలో సైడ్ డ్రైనేజీలకు నిధులకు కేటాయించాలని సూచించారు. శ్రీనగర్ నుంచి కొడిశలకుంట రోడ్డు, అబ్బాపూర్‌లో సైడ్ డ్రైనేజీకి నిధులు మంజూరు చేయాలని అన్నారు. మంగపేట మండలం కోమటిపల్లి నుంచి కాటాపూర్ రోడ్డు విస్తరణకు పూర్తిస్థాయిలో నిధులు అందించాలని కోరారు.

న్యాయం చేయాలని వినూత్న నిరసన

భూపాలపల్లి అర్బన్: కొనుగోలు చేసిన ఇంటిని ఇవ్వకుండా యజమాని ఇబ్బందులకు గురిచేస్తున్నాడని పోలీసులు పట్టించుకోవడం లేదని తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణానికి చెందిన వ్యాపారి కట్కూరి రాజనర్సు జిల్లా కేంద్రంలో బుధవారం అంబేడ్కర్ సెంటర్‌లో తల కిందికి పెట్టి కాళ్లు పైకి ఎత్తి నిరసన చేశారు. పట్టణంలోని రాజీవ్‌నగర్‌కాలనీలో మిట్టపల్లి కుమారస్వామికి చెందిన ఇంటిని 2021 సంవత్సరంలో కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపాడు. నాటి నుంచి ఆ ఇంటి యజమాని ఇల్లు ఖాళీ చేయడం లేదని పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. నా పైనే ఎస్సీ., ఎస్టీ కేసులు పెట్టిస్తామని భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి తన న్యాయం చేయాలని కోరారు.

20 లీటర్ల గుడుంబా పట్టివేత

మహదేవపూర్: మండలంలోని కుదురుపల్లి క్రాస్‌రోడ్డు వద్ద సుమారు 20 లీటర్ల గుడుంబాను స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై రాజకుమార్ తెలిపిన వివరాలు ప్రకారం.. గంగారం గ్రామానికి చెందిన లావుడ్య లక్ష్మి కుదురుపల్లికి గుడుంబాను తరలిస్తున్న క్రమంలో కుదురుపల్లి క్రాస్‌రోడ్డు వద్ద పోలీస్‌లు తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. దీంతో లక్ష్మి వద్ద 20 లీటర్ల గుడుంబా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

సదరం క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

టేకుమట్ల : ఈ నెల 22న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సదరం క్యాంపును టేకుమట్ల, రేగొండ మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓలు అనిత, సురేందర్ బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఆర్థోపెడిక్ విభాగానికి సంబంధించిన వారి జాబితాను మండల పరిషత్ కార్యాలయాల్లో నోటీస్ బోర్డుపై ఏర్పాటు చేశారన్నారు. జాబితాల్లో ఉన్న వారు జిల్లా కేంద్రంలో నిర్వహించే సదరం క్యాంప్‌కు హాజరై సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

బంధుత్వాలే సమాజంలో బలం



సినిమా వీక్షిస్తున్న సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్

ములుగు రూరల్: సమాజంలో బంధాలు, బంధుత్వాలే బలమని ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని రాంచంద్రాపూర్ తన స్వగ్రామంలో గ్రామస్తులతో కలిసి బలగం సినిమా వీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రజలు బంధుత్వాలకు విలువనివ్వకుండా మనస్పర్థలతో దూరమవుతున్నారని అన్నారు. బలగం సినిమా తెలంగాణ యాస, భాషలతో పల్లె జీవనానికి దగ్గరగా ఉందని అన్నారు. గ్రామస్తులతో కలిసి బలగం సినిమా చూడడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ హట్కర్ కల్పన-రూప్‌సింగ్, దొంతి ప్రతాప్‌రెడ్డి, రాంరెడ్డి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకపోడు కులస్తులు

చిట్యాల: మండలంలోని నైన్‌పాక గ్రామానికి నాయకపోడు కులస్తులకు సర్వే నంబర్ 257లో ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ తహసీల్దార్‌కు సమన్ కు బుధవారం వినతిపత్రం అందజేశారు. మా గ్రామంలో 70 మంది నిరుపేదలం కలిగి ఉన్నామని పేర్కొన్నారు. గతంలో రైతువేదిక ఎదురుగా ఉన్న పురాతన కోనేరు స్థలం ముందు ఉన్న ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్నాము. అప్పుడు అప్పటి పెద్ద మనుషులు మమ్ముల్ని కోనేరు స్థలంతో పాటు పాఠశాల ఉందని అక్కడి నుండి వెళ్లగొట్టారు. అప్పటి నుండి మాకు గుంట భూమి లేక అనేక అవస్థలు పడుతున్నామని ప్రభుత్వ భూమిలో మాకు ఇండ్ల స్థలం కేటాయించాలని వారు వేడుకున్నారు. ఈ విషయం పై స్పందించి తహసీల్దార్ సుమన్ మూడు నెలలలో మీ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. అలాగే సర్వేనంబర్ 442, 524లో మాకు కేటాయించిన పట్టాలు ఇచ్చి ఏళ్లు గడుస్తున్న మాకు ఇప్పటికీ భూమి చూపించలేదన్నారు. కార్యక్రమంలో నాయకపోడు కులస్తులు పెరుక చంద్రమౌళి, దేవర రమ, జంబుల రామదాసు, జంగ సహదేవ్, పెరుమాండ్ల సమ్మక్క, మళ్లరం సమ్మక్క, జంబుల వినోద, దేవర లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

హేమాచలక్షేత్రంలో డీఎంహెచ్‌ఓ పూజలు



ఫ్యాన్లు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య, నిఖిల్‌కుమార్

మంగపేట: మండలంలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామిని జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య, బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కారం నిఖిల్‌కుమార్‌తో కలిసి బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన సందర్భంగా ఆలయ సాంప్రదాయ ప్రకారంగా పూజారులు మర్యాద పూర్వకంగా ఆహ్వానం పలికారు. అనంతరం ఆలయంలో స్వయంభువు స్వామివారికి అప్పయ్య, నిఖిల్ కుమార్ కుటుంబ సభ్యులు గోత్రనామాలతో ప్రత్యేక అర్చనలు జరిపించారు. స్వామివారి విశిష్టత, ఆలయ పురాణాన్ని వివరించి స్వామివారి శేషవస్త్రాలను బహూకరించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు ఏడునూతుల ఈశ్వర్‌చంద్ రామానుజం, అనిపెద్ది మురళి, డీఎంహెచ్‌ఓ కార్యాలయ సిబ్బంది, ఆలయ సిబ్బంది శేషు, నూతులకంటి అజయ్ పాల్గొన్నారు.

సీలింగ్ ఫ్యాన్లు బహూకరణ

శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కారం నిఖిల్‌కుమార్, డాక్టర్ వైశాలి దంపతులు, బొల్ల ప్రశాంతి, కొడకల్ల శ్రీకర్, బి.జగదీష్, సౌమ్య దంపతులు, ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి బంజారాహిల్స్ డాక్టర్లు హరీష్ వీరు జిల్లా వైద్యాధికారి అప్పయ్య సమక్షంలో 7 సీలింగ్ ఫ్యాన్లు బహూకరించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



ములుగు రూరల్ : పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న తస్లీమా మహ్మద్


ములుగు రూరల్: గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన మల్యాల శివశంకర్ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. బుధవారం ఆయన కుటుంబ సభ్యులను ములుగు, భూపాలపల్లి జిల్లాల సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ పరామర్శించారు. శివ శంకర్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె వెంట సర్వర్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు ఉన్నారు.

వెంకటాపురం(ఎం): మండలంలోని గుంటూరుపల్లి, పాలంపేట గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలను ములుగు, భూపాలపల్లి జిల్లా సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ బుధవారం పరామర్శించారు. పాలంపేటకు చెందిన ముసిగుంపుల సుధాకర్, గుంటూరుపల్లికి చెందిన సామర్ల పోశయ్యలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం దశదినకర్మ కార్యక్రమం నిర్వహించగా తస్లీమా హాజరై మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళ్లులర్పించారు. బాధిత కుటుంబాలను ఓదార్చి, సర్వర్ చారిటబుల్ ట్రస్టు అండ్ ఫౌండేషన్ ద్వారా 50 కేజీల బియ్యం అందించారు. తస్లీమా వెంట సర్వర్ చారిటబుల్ ట్రస్టు ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్థులు ఉన్నారు.

ఆర్డినరీ బస్సులకు ఎక్స్‌ప్రెస్ బోర్డులు

భూపాలపల్లి రూరల్: ఆర్డినరీ బస్సులకు ఎక్స్‌ప్రెస్ బోర్డులు తగిలించి ఎక్స్‌ప్రెస్ చార్జీలు వసూలు చేయడం సరికాదని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పసునూటి రాజేందర్ ఆరోపించారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్ మాట్లాడుతూ జిల్లాలోని ఏకైక బస్ డిపోలో ఉన్ 'పల్లె వెలుగు బస్సులు ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేద ప్రజలకు తక్కువ చార్జీలతో నడిపిస్తే. నేడు బీఆర్‌ఎస్ అధిక చార్జీలు పెంచి పేదలను దోచుకుంటున్నారన్నారు. ఈ విషయంపై పై అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రయాణికులకు బస్ సెల్టర్ సౌకర్యం కల్పించాలన్నారు. జిల్లా కేంద్రం నుంచి హన్మకొండకు ఏసీ బస్సులు ఎక్కువగా నడిపించాలి. కార్యక్రమంలో భూపాలపల్లిఅర్బన్ అధ్యక్షుడు దేవన్, రూరల్ అధ్యక్షుడు రామచంద్రయ్య, పాల్గొన్నారు.

కాంగ్రెస్ కుటుంబ సభ్యులకు పార్టీ అండ



బాధిత కుటుంబ సభ్యుడికి చెక్కు అందజేస్తున్న సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా పార్టీ అండగా ఉంటుందని, టీపీసీసీ సభ్యుడు, భూపాలపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. పార్టీ క్రియాశీల సభ్యత్వం కలిగి ఉన్న కమలాపూర్‌కు చెందిన తాళ్లపల్లి సారయ్య ప్రమాదవశాత్తు ఇటీవల చనిపోగా, వారి కుటుంబ సభ్యులకు బుధవారం సత్యనారాయణరావు బీమా చెక్కు అందించారు. కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం తీసుకొన్న ప్రతి కార్యకర్తకు అండగా పార్టీ ఉంటుందన్నారు. సభ్యత్వ నమోదు చేసుకున్న కార్యకర్తలకు రూ.2లక్షల ప్రమాద బీమా చెక్కులతో ఆయా కుటుంబాలకు భరోసా ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంకరి రామచంద్రయ్య, నాయకులు తోట సంతోష్, అంబాల శ్రీనివాస్, స్వామి, రమేష్,తోట రంజిత్, తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతున్న గృహిణి మృతి

టేకుమట్ల: చికిత్స పొందుతూ గృహిణి రాచపెల్లి సంధ్య(30) మృతి చెందిన సంఘటన మండలంలోని దుబ్యాలలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గసిగంటి కొమురయ్య-సునీత దంపతుల కుమార్తె సంధ్యను 2020లో కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం నల్లనిరామయ్యపల్లికి చెందిన రాచపెల్లి సతీష్‌తో వివాహం జరిపించారు. గత కొన్ని రోజులుగా మతిస్థిమితం కోల్పోయి ప్రవర్తిస్తుందని తెలిపారు. ఇటీవలే తన భర్త సతీష్ సంధ్య తల్లిగారింటికి తీసుకురాగా మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సూపర్ వాస్మోల్ ఆయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. బుధవారం మృతురాలి తండ్రి కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చల్ల రాజు తెలిపారు.